సోమప్ప సర్కిల్‌లో ఏర్పాటు చేసిన తోరణాలు

పోరు కార్యాచరణకు సిద్ధం...

- నేటి నుంచి సిపిఎం జిల్లా మహాసభ
- ఎరుపెక్కిన ఎమ్మిగనూరు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/ఎమ్మిగనూరు

ఉద్యమాల ద్వారా పోరుబాట సాగించేందుకు కార్యాచరణ రూపొందించేందుకు సర్వం సిద్ధమైంది. ఆదివారం నుంచి ఎమ్మిగనూరు పట్టణంలో సిపిఎం 23వ జిల్లా మహాసభ నిర్వహించనున్నారు. రెండు రోజుల పాటు ఈ మహాసభ నిర్వహించనున్నారు. తొలి రోజైన ఆదివారం ఉదయం భారీ ప్రదర్శన అనంతరం బహిరంగ సభ నిర్వహించనున్నారు. కొత్త మున్సిపల్ కార్యాలయం నుంచి సోమప్ప సర్కిల్ సమీపంలోని తహశీల్దార్ కార్యాలయం వరకూ ప్రదర్శన సాగనుంది. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ బహిరంగ సభలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, వి.వెంకటేశ్వర్లు పాల్గొని ప్రసంగించనున్నారు. అనంతరం మధ్యాహ్నం నుంచి మాచాని సోమప్ప మెమోరియల్ హాల్‌లో ప్రతినిధుల సభ ప్రారంభం కానుంది. ఈ ప్రతినిధుల సభకు జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి 200 మంది ప్రతినిధులు హాజరు కానున్నారు. గత మహాసభ నుంచి ఈ మహాసభ నుంచి నిర్వహించిన పోరాటాలపైన సమీక్ష చేసుకోనున్నారు. భవిష్యత్తులో చేపట్టబోయే ఉద్యమ కార్యాచరణను రూపొందించనున్నారు. జిల్లాను సమగ్రాభివృద్ధి చేయాలని, పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని, ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దాలని, జిల్లాలో వైద్య రంగాన్ని అభివృద్ధి చేయాలని, మౌలిక వసతులు కల్పించాలని ఈ మహాసభలో తీర్మానించనున్నారు. జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, కర్నూలు జిల్లాలో పర్యాట అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, జిల్లాలో వలసలను నివారించాలని ఈ మహాసభలో డిమాండ్ చేయనున్నారు. పాఠశాల విద్యలో ప్రభుత్వ రంగంలో జిల్లాలో మరిన్ని నూతన పాఠశాలలు, ప్రత్యామ్నాయ పాఠశాలలు ఏర్పాటు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయు లకు పెండింగ్ డిఎను విడుదల చేయాలని, సిపిఎస్, జిపిఎస్ రద్దు చేయాలని, ఓపిఎస్‌ను పునరుద్ధరించాలని మహాసభలో తీర్మానించనున్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి వారిని క్రమబద్ధీకరించాలని, ఐటి, ఫార్మ, బిపిఓ, కెపిఓ కంపెనీలను ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని మహాసభలో డిమాండ్ చేయనున్నారు. జిల్లాలో రైల్వేను అభివృద్ధి చేయాలని, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలను ఎయిమ్స్ తరహాలో అభివృద్ధి చేయాలని, జిల్లాలో పట్టణాల్లోని సమస్యలను పరిష్కరించాలని, కర్నూలు, ఆదోనిలో తాగునీటి అవసరాల కోసం రెండో సమ్మర్ స్టోరేజి ట్యాంకులు నిర్మించాలని మహాసభలో తీర్మానించనున్నారు. సిపిఎం జిల్లా మహాసభ నేపథ్యంలో ఎమ్మిగనూరు పట్టణం ఎరుపెక్కింది. పట్టణంలోని సోమప్ప సర్కిల్‌తో పాటు పలు కూడళ్లలో ఎర్ర తోరణాలు, జెండాలు ఏర్పాటు చేశారు. మహాసభ ప్రారంభం సందర్భంగా ఎమ్మిగనూరులో ఆదివారం ఉదయం నిర్వహించే ప్రదర్శన, బహిరంగ సభకు ప్రజలు, అభ్యుదయ వాదులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ కోరారు.

సాగిందిలా..!

- నూతన ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు
- బడ్జెట్‌లో జిల్లాకు అన్యాయం
- వెల్లువెత్తిన కార్మిక, కర్షక సంఘాల నిరసనలు
- వరి రైతులను దెబ్బతీసిన 'ఫెంగల్'

మరో మూడు రోజుల్లో 2024 సంవత్సరం ముగియనుంది. 2025 సంవత్సరం ప్రారంభం కానుంది. ఈ ఏడాదిలో ఎన్నో కార్యక్రమాలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జరిగాయి. ఏడాది ముగియనున్న సందర్భంగా కొన్ని ముఖ్యమైన ఘటనలను గుర్తు చేసుకుందాం...

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

కర్నూలు నగరంలో పోలింగ్‌లో పాల్గొన్న ఓటర్లు (ఫైల్)

● మారిన రాజకీయ ముఖచిత్రం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ ఏడాది రాజకీయ ముఖచిత్రం మారిపోయింది. గతంలో జిల్లాలోని 14 ఎమ్మెల్యేలు, రెండు ఎంపీ స్థానాల్లో వైసిపి అభ్యర్థులే ఉండగా 2024 ఎన్నికల్లో టిడిపి కూటమి హవా కనపరిచింది. రెండు పార్లమెంట్ స్థానాలతో పాటు 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో టిడిపి కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. వైసిపి రెండు అసెంబ్లీ నియోజకవర్గాలతో సరిపెట్టుకుంది. కర్నూలు ఎంపీ స్థానంలో టిడిపి అభ్యర్థి బస్తిపాటి నాగరాజు సమీప ప్రత్యర్థి వైసిపి ఎంపీ అభ్యర్థి బివై.రామయ్యపై విజయం సాధించారు. నంద్యాల ఎంపీ స్థానంలో టిడిపి అభ్యర్థి బైరెడ్డి శబరి సమీప ప్రత్యర్థి వైసిపి అభ్యర్థి పోచ బ్రహ్మానంద రెడ్డిపై విజయం సాధించారు. ఆలూరులో వైసిపి అభ్యర్థి బుసినే విరూపాక్షి, మంత్రాలయంలో వైసిపి అభ్యర్థివై బాలనాగిరెడ్డి గెలుపొందారు. ఎమ్మిగనూరులో టిడిపి అభ్యర్థి బివి జయ నాగేశ్వరరెడ్డి, కోడుమూరులో టిడిపి అభ్యర్థి బొగ్గుల దస్తగిరి గెలుపొందారు. పత్తికొండలో టిడిపి అభ్యర్థి కెఇ శ్యామ్ కుమార్, కర్నూలులో టిడిపి అభ్యర్థి టిజి.భరత్, పాణ్యంలో టిడిపి అభ్యర్థి గౌరుచరిత రెడ్డి విజయం సాధించారు. సిపిఎం అభ్యర్థి డి.గౌస్ దేశాయ్ 3,081 ఓట్లతో మూడో స్థానాన్ని దక్కించుకున్నారు. ఆళ్లగడ్డలో టిడిపి అభ్యర్థి భూమా అఖిలప్రియ, బనగానపల్లెలో టిడిపి అభ్యర్థి బిసి జనార్ధన్ రెడ్డి, డోన్‌లో టిడిపి అభ్యర్థి కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి విజయం సాధించారు. శ్రీశైలంలో టిడిపి అభ్యర్థి బుడ్డా రాజశేఖర్ రెడ్డి, నందికొట్కూరులో టిడిపి అభ్యర్థి గిత్త జయసూర్య, నంద్యాలలో టిడిపి అభ్యర్థి ఎన్ఎండి ఫరూక్, ఆదోనిలో బిజెపి అభ్యర్థి వాల్మీకి పార్థసారథి గెలుపొందారు. అందులో బిసి జనార్ధన్ రెడ్డి, టిజి భరత్, ఎన్ఎండి ఫరూక్‌కు మంత్రి పదవులు దక్కాయి.

● ఉత్సాహంగా బాలోత్సవం

కర్నూలు బాలోత్సవం కర్నూలు నగర శివార్లలోని మాంటిసోరి ఇండస్ పాఠశాలలో ఫిబ్రవరి 8, 9న అట్టహాసంగా నిర్వహించారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి విద్యార్థులు పాల్గొని సందడి చేశారు. విద్యార్థులకు నృత్య పోటీలు, గేయాలాపన, ఏకపాత్రాభినయం, విచిత్ర వేషధారణ, వ్యాస రచన, చిత్రలేఖనం, వక్తృత్వం పోటీలు నిర్వహించారు.

కల్యాణమ్మకు నివాళులర్పిస్తున్న అతిథులు

● కర్రల సమరంలో రక్తపాతం..

దసరా సందర్భంగా కర్నూలు జిల్లా హొళగుంద మండల పరిధిలోని నెరణికి, నెరణికి తండా, కొత్తపేట కొండ గుహలో వెలసిన దేవరగట్టు శ్రీమాల మల్లేశ్వరల జైత్రయాత్ర (కర్రల సమరం) అక్టోబర్ 13న అర్ధరాత్రి జరిగింది. నిఘనేత్రాలు ఉన్నప్పటికీ కర్రలు నాట్యం ఆడాయి. జైత్ర యాత్రలో రింగ్ కర్రలు, అగ్ని దివిటీల ఆవిరి తగిలి 95 మందికి గాయాలయ్యాయి అందులో 25 మందికి బలమైన గాయాలయ్యాయి.

● యురేనియంపై పోరు..

పొంచి ఉన్న అణు ముప్పు కారణంగా తమ ఎలాంటి తవ్వకాలు చేపట్టొద్దంటూ దేవనకొండ మండలం కప్పట్రాళ్లతో పాటు మరో 12 గ్రామాలు నిరసన దీక్షలు చేపట్టారు. యురేనియం వెలికి తీస్తే మానవాళి మనుగడ ప్రశ్నార్థకం కానుందని తెలుసుకున్న ఆయా గ్రామాల ప్రజలు యురేనియం తవ్వకాలను అడ్డుకునేందుకు ఏమయ్యారు. తవ్వకాలు నిలిపివేసే వరకూ పోరాటం తప్పదని హెచ్చరించారు. నవంబర్ 11న కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. దీంతో స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు యురేనియం అన్వేషణ కోసం ఎలాంటి తవ్వకాలూ చేపట్టవద్దని ఆదేశాలు జారీ చేశారు.

● ప్రజా వ్యతిరేక విధానాలపై కన్నెర్ర

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 16న కార్మిక సంఘాల ఐక్యవేదిక, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కార్మిక సమ్మె, గ్రామీణ బంద్ చేపట్టారు. కర్నూలు, నంద్యాలలో భారీ నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఇతర పట్టణాలలో సమ్మె, గ్రామాల్లో బంద్ చేపట్టారు. ఇందులో భాగంగా పలు ప్రాంతాల్లో రాస్తారోకోలు కూడా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను మార్చుకోవాలని హెచ్చరించారు.

నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

● ఈసారీ అరకొర కేటాయింపులే..!

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నవంబర్ 11న రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. 2024-25 సంవత్సరానికి సంబంధించి రూ.2.94 లక్షల కోట్ల ప్రతిపాదనతో బడ్జెట్‌ను ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లాకు అన్యాయం జరిగింది. కొత్త ప్రాజెక్టుల ఊసే లేదు. కర్నూలు జిల్లాలో ప్రాజెక్టులు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీలిస్తున్నా బడ్జెట్‌లో మాత్రం కేటాయింపులు చేయలేదు. గుండ్రేవుల, వేదవతి, ఆర్‌డిఎస్ కుడి కాలువ నిర్మాణాలకు ఎలాంటి నిధులు కేటాయించలేదు. కర్నూలు జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు మొత్తం 561.94 కోట్లను కేటాయించారు. క్లస్టర్ యూనివర్సిటీకి రూ.1.40 కోట్లు, రాయలసీమ యూనివర్సిటీకి రూ.10.45 కోట్లు, అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీకి రూ.1.50 కోట్లను కేటాయిస్తున్నట్లు బడ్జెట్‌లో పేర్కొన్నారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ గురించి బడ్జెట్‌లో ప్రస్తావించలేదు.

● సమస్యలపై ప్రజాపోరు

అధిక ధరలు, నిరుద్యోగం, మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు, విద్యుత్ ఛార్జీలు, వలసల నివారణ రైతులకు గిట్టుబాటు ధరల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నవంబర్ 8 నుండి 13 వరకు ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో ప్రజా పోరు పేరుతో ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. 14న అన్ని మండల కేంద్రాలతో పాటు కలెక్టరేట్ వద్ద ధర్నాలు చేపట్టారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యాయని విమర్శించారు. ప్రజలకు మేలు చేయకుండా భారాలు వేసే పని పెట్టుకున్నదని, విద్యుత్ ట్రూఆఫ్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఎదురు చూపులు..!

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

నూతన ప్రభుత్వంలో కొత్త పింఛన్లు ఇస్తారని ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు నిరాశ ఎదురవుతోంది. అర్హులైన వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు కొత్త పింఛన్లు ఎప్పుడు మంజూరు చేస్తారని ఆశగా ఎదురుచూస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వం చివరలో దరఖాస్తు చేసుకున్న ధ్రువీకరణ పత్రాలను సచివాలయ ఉద్యోగులు పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదు. దీంతో వారు మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అర్హులైన వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు కొత్త పింఛన్ల కోసం సంవత్సరన్నర నుండి ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కొత్త పింఛన్లు, రేషన్ కార్డులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి ఆరు నెలలు అవుతున్నా పట్టించుకోవడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్నవారు ప్రతిరోజు సచివాలయం చుట్టూ తిరుగుతూ పింఛన్ ఎప్పుడు మంజూరవుతుందని సిబ్బందితో వాగ్వివాదానికి దిగుతున్న సంఘటనలు నెలకొంటున్నాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అనధికారికంగా పింఛన్లు పొందుతున్న వారిపై విచారణ చేసి అనర్హులను తొలగించాలని ప్రకటించింది. కానీ నూతన పింఛన్ల దరఖాస్తుల కోసం విధానాలను ప్రకటించలేదు. పింఛన్లపై అధికారులు విచారణ చేపట్టడంతోప్రజల్లో కొంత గందరగోళం నెలకొంది. అనర్హులను త్వరగా తొలగించి కొత్త పింఛన్ల కోసం మార్గదర్శకాలు విడుదల చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ప్రతి లబ్ధిదారుడు సంబంధిత ధ్రువీకరణ పత్రాలను సచివాలయ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్న పత్రాలు మండల పరిషత్ కార్యాలయం ద్వారా ఆర్డిఓ కార్యాలయంకు చేరుకొని పరిశీలన అనంతరం రాష్ట్ర కార్యాలయానికి వెళ్తాయి. అక్కడ పరిశీలించి అనంతరం నివేదికను ప్రభుత్వానికి అందజేయాల్సి ఉంటుంది. ఎంతమంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు, ఎన్ని దరఖాస్తులు ఎలిజిబుల్ అయ్యాయని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి వుంటుందని అధికారులు తెలుపుతున్నారు. గత ప్రభుత్వం దరఖాస్తు చేసుకున్న పింఛన్‌దారుల దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నట్లు రికార్డులు చూపుతున్నాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

కొనసాగిన నిరసనలు : డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేసి కఠినంగా శిక్షించాలని జిల్లా వ్యాప్తంగా నిరసనలు కొనసాగాయి. సిపిఎం, సిఐటియు, కెవిపిఎస్ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసనలు, రాస్తారోకోలు చేపట్టారు. కొన్ని ప్రాంతాల్లో అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్, మాల మహానాడు, తదితర సంఘాల ఆధ్వర్యంలోనూ నిరసనలు నిర్వహించారు. అమిత్ షా వ్యాఖ్యల పట్ల దళిత సంఘాల నుంచి కూడా ఆగ్రహం వ్యక్తమవుతోంది. అమిత్ షాను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని, అమిత్ షా బహిరంగ క్షమాపణ చెప్పాలన్న డిమాండ్ వ్యక్తమవుతోంది.

అవీ..ఇవీ..అన్నీ.. : ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శత వసంత వేడుకలు నిర్వహించారు. ఆయా మండలాల్లో అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. జిల్లా వ్యాప్తంగా జాతీయ గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చర్చిలతో ప్రత్యేక ప్రార్థనలు చేసి, కేకులు కోసి సంబరాలను జరుపుకున్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు పలు గ్రామాల్లో నిర్వహించారు.

దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు

-పోలీసు ఉద్యోగాలపై ఎస్‌పి బిందు మాధవ్
-మోసగాళ్ళ పట్ల అప్రమత్తంగా ఉండండి
-నిష్పక్షపాతం, పారదర్శకంగా పోలీసు కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు
-30 నుండి ఫిబ్రవరి 1 వరకు పోలీసు కానిస్టేబుల్ ఈవెంట్స్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

మోసగాళ్ళు, దళారుల పట్ల అప్రమత్తంగా ఉంటూ మోసాల బారిన పడవద్దని కర్నూలు జిల్లా ఎస్‌పి జి.బిందుమాధవ్ కానిస్టేబుల్ అభ్యర్థులకు శనివారం తెలిపారు. ఎవరైనా మోసాలకు పాల్పడితే కఠినంగా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్‌పి హెచ్చరించారు. దళారులు,మోసగాళ్లు ఎవరినైనా సంప్రదిస్తే డయల్ - 100 కు, లేదా సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. ఫిర్యాదు చేసిన లేదా సమాచారం అందించిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్‌పి పేర్కొన్నారు. అభ్యర్థులు వారికి కేటాయించిన నిర్ణీత సమయాలలో మాత్రమే ఉదయం 5 గంటల నుండి 10 గంటల లోపు కర్నూలు ఎపిఎస్‌పి 2వ బెటాలియన్‌లోకి చేరుకోవాలన్నారు. దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యే కానిస్టేబుల్ అభ్యర్థులకు జిల్లా ఎస్‌పి పలు సూచనలు చేశారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు 2 సెట్ల జిరాక్స్ కాపీలు అటెస్ట్ చేసినవి తీసుకురావాలన్నారు. రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ వచ్చిన తర్వాత జారీచేసిన కుల ధ్రువీకరణ పత్రం, క్రీమిలేయర్ ధ్రువీకరణ పత్రం తీసుకురావాలన్నారు. ఇప్పటికే అభ్యర్థులకు హాజరకావాల్సిన తేదీ, సమయానికి సంబంధించి హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో ఉంచామన్నారు. కేటాయించిన తేదీ, సమయానికి అభ్యర్థులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. నాలుగో తరగతి నుండి పదో తరగతి వరకూ స్టడీ సర్టిఫికెట్లను తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. ఒకవేళ అభ్యర్థులు ప్రైవేట్ గా చదివి ఉంటే నోటిఫికేషన్ తర్వాత జారీ చేసిన రెసిడెన్స్ సర్టిఫికెట్‌ను తీసుకురావాలన్నారు. కర్నూలు ఉమ్మడి జిల్లాలో మొత్తం 10,143 మంది అభ్యర్థులు హాజరవుతున్నారన్నారు. ప్రతి రోజు 600 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. దేహదారుఢ్య పరీక్షలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ఇప్పటికే కర్నూలు జిల్లా పోలీసు యంత్రాంగం తరపున చేసినట్లు తెలిపారు. దేహదారుఢ్య పరీక్షలకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నామని, పరీక్షలు నిర్వహించే ప్రదేశాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులు మైదానంలోకి ప్రవేశించినది మొదలుకుని, వారు దేహదారుఢ్య పరీక్షలు ముగించుకుని మైదానం నుండి తిరిగి వెళ్ళే వరకూ వారికి అర్థమయ్యే రీతిలో ప్రతి పరీక్ష ఘట్టాన్ని సూచించే విధంగా సూచిక బోర్డులను ఏర్పాటు చేశామన్నారు. దేహదారుఢ్య పరీక్షలకు వచ్చే అభ్యర్థులు పరీక్షలకు వచ్చే అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికేట్లతో పాటు ఒక సెట్ అటెస్టడ్ జిరాక్స్ కాపీలను తప్పనిసరిగా సమర్పించామన్నారు. ఒరిజినల్ సర్టిఫికట్లు సమర్పించని యెడల వారి అభ్యర్థిత్వం తిరస్కరిస్తామన్నారు. వారికి సమయం ఇవ్వబోమన్నారు. ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామని, డబ్బులు ఇవ్వమని ప్రచారం చేసే వారి సమాచారాన్ని డయల్ 100 కు , డయల్ 112, లేదా స్థానిక పోలీసు వారికి , కర్నూలు జిల్లా పోలీసు వాట్సప్ నెంబర్ 7777877722 లేదా 9121101100 కు తెలియజేయస్తే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్‌పి తెలిపారు.

ప్రజాశక్తి క్యాలెండరును ఆవిష్కరించిన ఎమ్మెల్యే దస్తగిరి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ప్రజాశక్తి ముద్రించిన నూతన సంవత్సర 2025 క్యాలెండర్ ను కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఆయన స్వగ్రామం కర్నూలు మండలం పసుపుల నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ అందమైన ఆకర్షణీయమైన న్యూ ఇయర్ క్యాలెండర్‌ను వేసిన ప్రజాశక్తికి అభినందనలు తెలిపారు. ఈ ఆవిష్కరణలో ప్రజాశక్తి డెస్క్ ఇంచార్జి పానుగంటి చంద్రయ్య, కర్నూలు డివిజన్ ఇంచార్జి ఎం.రాజు, ప్రజాశక్తి సిబ్బంది, విలేకరులు ఎల్లా గౌడ్, మునిస్వామి, మధు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

పరీక్షా పే చర్చాలో భాగస్వామ్యం కావాలి

డిఇఒ శామ్యూల్ పాల్

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

జనవరిలో జరిగే పరీక్ష పే చర్చా కార్యక్రమంలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.శామ్యూల్ పాల్ సూచించారు. శనివారం ఓర్వకల్ మండలంలోని నన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్షా పే చర్చ 2025 నమోదును డిఇఒ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనవరిలో నిర్వహించే 8వ ఎడిషన్ పరీక్షా పే చర్చ కార్యక్రమంలో పాల్గొనేందుకు 6 నుంచి 12వ తరగతి చదువుతున్న స్టూడెంట్స్, వారి తల్లిదండ్రులు, టీచర్ల నుంచి దరఖాస్తులకు కేంద్ర ప్రభుత్వం ఆహ్వానిస్తోందన్నారు. విద్యార్థులకు పరీక్షలపై ఉన్న భయాందోళనను తొలగించేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ఓంకార్ యాదవ్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రణేష్‌కుమార్ గౌరి నందన రెడ్డి, మద్దులేటి, వెంకటేశ్వర్లు, అనిత, రాజీవ్ కుమారి, కళావతి, బోధనతర సిబ్బంది పాల్గొన్నారు.

బిర్లా ఓపెన్ మైండ్స్‌లో గణిత దినోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్లు మండలంలోని నన్నూరు గ్రామ సమీపంలోని బిర్లా ఓపెన్ మైండ్స్ పాఠశాలలో శనివారం గణిత దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిఇఒ ఎస్.శామ్యూల్‌పాల్ పాల్గొని శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గణితంపై భయాందోళనకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. గణితం నేర్చుకోవడం విద్యార్థులకు ఎంతో సులభకరమన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ ఓంకార్ యాదవ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణిత దినోత్సవంలో డిఇఒ శామ్యూల్‌పాల్

గీతాంజలి నర్సింగ్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలోని గాయత్రి ఎస్టేట్స్‌లోని గీతాంజలి నర్సింగ్ కళాశాల లో 2023-2024 వ సంవత్సరం 2వ సెమిస్టర్, 4వ సెమిస్టర్ నర్సింగ్ విద్యార్థుల ఫలితాలలో 94 శాతం ఉత్తీర్ణత సాధించారని కళాశాల కరస్పాండెంట్ పెరుగు విజయవర్ధన్‌రెడ్డి తెలిపారు. డాక్టర్ ఎన్‌టిఆర్ హెల్త్ అండ్ సైన్స్ విశ్వవిద్యాలయం విజయవాడ నుంచి విడుదల చేశారని తెలిపారు. అందులో భాగంగా గీతాంజలి నర్సింగ్ కళాశాల విద్యార్థులకు 27 డిస్టింక్షన్స్, 55 ఫస్ట్ క్లాస్, 10 సెకండ్ క్లాస్‌లతో విజయభేరి మోగించారని, కళాశాల ఉత్తీర్ణత శాతం 94శాతంతో నిలించిందన్నారు. కాలేజీ టాపర్స్‌గా సునీల (కేరళ), కృష్ణ (కేరళ), శ్రీలేఖ, మాధవి, అనూష, అరుణలు ప్రతిభ కనబరిచారని కళాశాల కరెస్పాండెంట్ పెరుగు విజయ్ వర్ధన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఐన్ముందు ఇంకా ఎక్కువ స్కోర్ సాధించాలని సూచించినారు. కళాశాల ప్రిన్సిపల్ వసంత కుమారి, సిబ్బంది సురేఖ, నిర్మల, సంధ్యారాణి, స్వప్న లు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

జర్నలిస్టుల ఉచిత వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రింటు ఎలక్ట్రానిక్ మీడియాలలో పనిచేస్తున్న జర్నలిస్టుల ఆరోగ్య సమస్యలపై శనివారం ఉచిత వైద్య శిబిరం ఫోటో వీడియో జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మీసాల రామస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. కర్నూలు కలెక్టరేట్ సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయం, మీడియా రూమ్ దగ్గర జర్నలిస్టులకు వినికిడి సమస్యల పరీక్షలు, ఎముకల సమస్యలు, కంటి సమస్యల పరీక్షలు చేశారు. మీసాల రామస్వామి మాట్లాడుతూ జర్నలిస్టులు తమ ఆరోగ్య సమస్యలను పక్కన పెడుతూ నిరంతరం ప్రజా సమస్యల పట్ల ముందుకు వెళుతున్నారన్నారు. జర్నలిస్టుల అనారోగ్య సమస్యల కోసం ఈ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామని తెలిపారు. సుశీల నేత్రాల డాక్టర్ ఈశ్వర్ , డాక్టర్లు చందు ,నాగార్జున, ఆర్క హాస్పిటల్ డాక్టర్ వంశీ, ఆడియాలజిస్ట్ జెవి సాయి రంగనాథ్ జర్నలిస్టులు చంద్రయ్య, సురేష్, శ్రీనివాసులు, వల్లి రమేష్ శివశంకర్ పాల్గొన్నారు

కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, పాల్గొన్న జర్నలిస్టులు

ఇకెవైసి తప్పనిసరి: సిఇఒ

ప్రజాశక్తి-సిబెళగల్

ప్రభుత్వ వ్యవసాయ సంబంధ పథకాల రాయితీలకు, సొసైటీ ఓటు హక్కు కోసం సొసైటీ రుణగ్రస్తులు ఇకెవైసి తప్పనిసరిగా చేసుకోవాలని సి బెళగల్ సిఇఒ రవిరెడ్డి పేర్కొన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ సహకార సంఘం బ్యాంకులను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయని అన్నారు. జీరోవడ్డీ, ఎరువులు, మందులు, విత్తనాలు, వ్యవసాయ సామాగ్రి, పంట రుణాలు, పంటలకు మద్దతు ధరలు వంటివి ఇకెవైసి చేయడంతోనే అమలు అవుతాయని, లేదంటే వర్తించవని ఈ సందర్భంగా మండలంలోని రైతులకు సూచించారు.

హెచ్‌పి ధనలక్ష్మి ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభం

ప్రజాశక్తి-సి బెళగల్ :

మండలంలోనీ కొండాపురం గ్రామంలో హెచ్ పి ధనలక్ష్మి ఫిల్లింగ్ స్టేషన్‌ను ప్రొప్రైటర్ జగదీశ్ శనివారం ఘనంగా ప్రారంభం చేశారు. ప్రారంభం అయిన వెంటనే అక్కడి వాహన దారులు, ప్రజలు అధిక మొత్తంలో చేరుకొన్నారు. ఈ ప్రాంతంలో, ఈ రోడ్డు గుండా పెట్రోల్ డీజిల్ బంకు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని పలువురు మీడియాలో పేర్కొన్నారు. కల్తీ పెట్రోలు, కల్తీ డీజిల్ పోయించుకొని వాహనాలను పాడు చేసుకోకూడదని ప్రొప్రైటర్ జగదీశ్ ఈ సందర్భంగా వినియోగదారులను కోరారు.

వివక్షకు తావు లేకుండా న్యాయం

- జడ్జి జ్యోతి

మాట్లాడుతున్న జడ్జి జ్యోతి

ప్రజాశక్తి - హాలహర్వి

ఏమైనా ఇబ్బందులు ఎదురైతే ఉచిత న్యాయ సహాయం పొందే హక్కు ప్రతి మహిళకూ ఉంటుందని, ఎలాంటి వివక్షకు తావు లేకుండా తగిన న్యాయ సహాయం అందజేస్తారని జడ్జి జ్యోతి, సీనియర్ న్యాయవాది ప్రవీణ్ తెలిపారు. జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చట్టాల పట్ల, మహిళలకు సంబంధించిన హక్కులు విధి విధానాల పట్ల అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, పోక్సో చట్టం, గృహ హింస, పనిచేసే ప్రదేశాల్లో లైంగిక వేధింపులు, వరకట్న నిషేధ చట్టం, హిందూ వివాహ చట్టం, భరణం, వివాహ రద్దు చట్టం, లింగ వివక్షతో కూడిన వేతనాల తదితర అంశాల గురించి మహిళలకు అవగాహన కల్పించారు. ఎస్ఐ చంద్ర మాట్లాడుతూ... వేధింపులు, ఇబ్బందులకు గురైన మహిళల కోసం పోలీసు స్టేషన్‌లో ప్రత్యేక ఏర్పాట్లు ఉన్నట్లు తెలిపారు. మహిళా పోలీసులు అన్నివేళలా అందుబాటులో ఉండి మహిళలకు రక్షణగా ఉంటారన్నారు. ఐసిడిఎస్ సిడిపి మదమ్మ, చంద్రావతి, చందన, న్యాయవాదులు షాకీర్, ఎంఇఒ శ్రీనివాసులు, ఎపిఎం శివయ్య పాల్గొన్నారు.

సిసి రోడ్లు, గోకులం షెడ్ల పరిశీలన

ప్రజాశక్తి - ఆస్పరి

సిసి రోడ్లను పరిశీలిస్తున్న ఎంపిడిఒ గీతావాణి

మండలంలోని చిరుమాన్ దొడ్డి గ్రామంలో వేసిన సిసి రోడ్లను, గోకులం షెడ్లను ఎంపిడిఒ గీతావాణి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సిసి రోడ్లు, గోకులం షెడ్ల పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. ఉపాధి హామీ చట్టం నిధుల ద్వారా చేపట్టిన రోడ్లు, డ్రెయినేజీ కాలువలు, షెడ్లు పది కాలాల పాటు ఉండేలా నాణ్యతగా వేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. నాణ్యత లోపించినా, క్యూరింగ్ లేకపోయినా చర్యలు తీసుకుంటామని, బిల్లులు కూడా పెట్టమని హెచ్చరించారు. ఇంజినీర్ అసిస్టెంట్ లక్ష్మన్న, టెక్నికల్ అసిస్టెంట్ రాజేంద్ర, టిడిపి నాయకులు మల్లికార్జున పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం పరిశీలన : ఆస్పరి సచివాలయం-1లో నిర్వహించిన ఆధార్ క్యాంపును ఎంపిడిఒ గీతావాణి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ... రెండు రోజుల పాటు చేపట్టిన ఆధార్ క్యాంపులో ఆధార్ నమోదు కార్యక్రమంలో 0-5 సంవత్సరాల పిల్లలకు కొత్త ఆధార్ ఎన్‌రోల్‌మెంట్, అపార్‌కు సంబంధించి పేరు కరెక్షన్, జనన ధ్రువీకరణ పత్రాల ఆధారంగా విద్యార్థులకు ఈ ఆధార్ క్యాంపు చాలా దోహద పడిందన్నారు. డిజిటల్ అసిస్టెంట్ భార్గవి పాల్గొన్నారు.

అమరుల స్ఫూర్తితో
విద్య, ఉపాధి కోసం ఉద్యమం

- ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు మైనా

ప్రజాశక్తి - ఆలూరు

అమరుల స్ఫూర్తితో విద్య, ఉపాధి కోసం ఉద్యమించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు మైనా కోరారు. ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలోని గర్ల్స్ హైస్కూల్‌లో ఎస్ఎఫ్ఐ జెండాను ఎగురవేశారు. మండల అధ్యక్షులు ఉమేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మైనా మాట్లాడారు. స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తి, భగత్ సింగ్ వారసత్వంతో ఎస్ఎఫ్ఎ అధ్యయనం, పోరాటం నినాదంతో 1970లో ఏర్పడిందన్నారు. స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాల కోసం అలుపెరగని పోరాటం చేస్తోందని చెప్పారు. 54 సంవత్సరాలు పూర్తి చేసుకొని అందరికీ నాణ్యమైన విద్య, ఉపాధి అందాలని పోరాడుతోందన్నారు. జాతీయ విద్యా విధానంతో జరుగుతున్న విద్యా వ్యాపారం, చరిత్ర ధ్వంసం, కేంద్ర ఆధిపత్యంపై నిలదీస్తూ పోరాటాలతో పాటు సేవా కార్యక్రమాల్లో ముందుండి పని చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా మాజీ ఉపాధ్యక్షులు గోవర్ధన్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి గిరి మూర్తి, మండల నాయకులు నీలకంఠ నాయక్, బసవరాజ్, మణి, రవి నాయక్, డాకే నాయక్ పాల్గొన్నారు.

జెండాను ఎగురవేస్తున్న నాయకులు

మున్సిపల్ యాక్ట్ కౌన్సిలర్లకేనా..?

- చైర్మన్, కమిషనర్‌కు వర్తించవా..?
- ఆదోనికి ఎమ్మెల్యే పార్థసారథి తెచ్చింది శూన్యం - నిలదీసిన కౌన్సిలర్లు

ప్రజాశక్తి - ఆదోని

మున్సిపల్ కార్యాలయంలో రూల్స్ అధికారులకు వర్తించవా అంటూ వైసిపి కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్లకు ప్రత్యేక వెయిటింగ్ హాలు కేటాయించి ఎందుకు తాళం వేశారని, మున్సిపల్ యాక్ట్ కేవలం కౌన్సిలర్లకే, చైర్మన్, మున్సిపల్ కమిషనర్, ఇతర అధికారులకు వర్తించదా అంటూ వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు సందీప్ రెడ్డి, వైజి.బాలాజీ చైర్మన్ శాంతను ప్రశ్నించారు. శనివారం చైర్మన్ శాంత అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సాదాసీదాగా జరిగినా మధ్యలో తీవ్రస్థాయిలో వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. కౌన్సిల్ ఆమోదం లేకుండానే కోట్లాది రూపాయల నిధులు ప్రభుత్వానికి ఎలా కట్టారని వైస్ చైర్మన్ నరసింహులు ప్రశ్నించారు. ప్రభుత్వం అత్యవసరంగా పేర్కొన్న వాటిని కౌన్సిల్ ఆమోదం కోసం వేచి ఉండమని, చైర్మన్ అనుమతితో నిధులు చెల్లించామని కమిషనర్ కృష్ణ సమాధానం ఇచ్చారు. మరి ఇప్పుడు ఎందుకు కౌన్సిల్ ఆమోదం అడుగుతున్నారని ప్రశ్నిస్తే... కౌన్సిల్ ఆమోదం చేయకపోతే కలెక్టర్ ఆమోదంతో సెక్షన్ 67 ప్రకారం పని జరిగిపోతుందని కమిషనర్ తెలిపారు. మున్సిపల్ కమిషనర్, చైర్మన్ కలిసి కౌన్సిలర్ల హక్కులను కాల రాస్తున్నారని, ఇది దారుణమని కౌన్సిలర్ సందీప్ రెడ్డి, వైస్ చైర్మన్ నరసింహులు మండిపడ్డారు. ఎమ్మెల్యే పార్థసారథి ఆదోని పట్టణ అభివృద్ధికి ఎలాంటి నిధులూ తేలేదని, ఇప్పటివరకు పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులు.. చివరకు ఎస్ఎస్ ట్యాంకు మరమ్మతులకు రూ.1.40 కోట్లు, అలాగే ఆయా వార్డుల్లో ఎమ్మెల్యే పర్యటించిన సందర్భంలో ఇస్తున్న హామీలు నెరవేర్చేందుకు మున్సిపాలిటీ నిధులే దిక్కు అని వైస్ చైర్మన్ నరసింహులు తెలిపారు. ఆదోని అభివృద్ధికి వైసిపి అడ్డుపడుతుందని ఎమ్మెల్యే ప్రతిసారీ చెబుతున్నారని, కౌన్సిల్ ఆమోదం లేకపోతే ఎమ్మెల్యే ఇచ్చిన హామీలు కూడా అమలు కావని తెలిపారు. మొన్నటి వరకు ఉన్న కౌన్సిలర్ల వెయిటింగ్ హాలుకు తాళమెందుకు వేశారని, ఇంత కక్ష సాధింపు చర్య కౌన్సిలర్లపై ఎందుకని ప్రశ్నించారు. గత కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు ఇంటి పన్ను కట్టలేదని ఎమ్మెల్యే పార్థసారథి ఆరోపించారని, అందరూ డబ్బులు కట్టారని, ఈ విషయం అధికారులకు తెలిసినా ఎందుకు నోరు విప్పలేదని కౌన్సిలర్ బాలాజీ ప్రశ్నించారు. మున్సిపల్ కార్యాలయానికి వచ్చే కౌన్సిలర్లు, ఆయా వార్డుల ప్రజలు ఎక్కడ కూర్చుని సమస్యలపై చర్చించుకోవాలని, చివరకు చైర్మన్ రూముకు కూడా తాళం వేస్తున్నారని, తామెక్కడ ఉండాలని ప్రశ్నించారు. దీనిపై అటు చైర్మన్, ఇటు కమిషనర్ సరైన హామీ ఇవ్వకపోవడంతో ఇకపై తాము కార్యాలయానికి వస్తే కమిషనర్ గదిలో కూర్చొని అక్కడే పనులు చేసుకుంటామని చెప్పడంతో.. ఎప్పుడైనా రావచ్చని కమిషనర్ కృష్ణ తెలిపారు. బసాపురం ఎస్ఎస్ ట్యాంకు మరమ్మతులు చివరి క్షణంలో గుర్తుకొస్తున్నాయని, గత 8 నెలలు ఏం చేశారని, ఇప్పటికే కోట్లాది రూపాయలు ఖర్చయ్యాయని, మళ్లీ మరో రూ.60 లక్షలు ఖర్చు చేయడానికి సిద్ధమవడం ఏమిటని, శాశ్వతంగా పరిష్కారం చూపాలని కౌన్సిలర్లు సందీప్ రెడ్డి కోరారు.

ఆరు నెలలుగా ఎమ్మెల్యే అనుచరుడు డబ్బు కట్టకపోయినా వసూలుకు అనుమతి

ఆదోని యూనీస్ లక్ష్మీబాయి మార్కెట్ వేలం పాట దక్కించుకున్న ఎమ్మెల్యే అనుచరుడు వీరేష్ మున్సిపాలిటీకి 50శాతం డబ్బులు కట్టాల్సి ఉన్నా కేవలం 10 శాతం మాత్రమే కట్టినా గత ఆరు నెలలుగా కిస్తు వసూలుకు ఎలా అనుమతి ఇచ్చారని వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్ బాలాజీ, సందీప్ రెడ్డి ప్రశ్నించారు. అదే కౌన్సిలర్లు ఇంటి పన్ను కట్టినా కట్టలేదని ఎమ్మెల్యే చెబితే కనీసం కట్టారని కూడా అధికారులు ఎందుకు చెప్పలేదని నిలదీశారు. ఎమ్మెల్యేకు ఒక న్యాయం, కౌన్సిలర్లకు మరో న్యాయం చేయడం తగదన్నారు. తాము అప్పట్లో లేమని, తాము వచ్చిన తర్వాత రికార్డులు పరిశీలిస్తే కాంట్రాక్టర్ వీరేష్ డబ్బులు కట్టాల్సి ఉందని గుర్తించి కౌన్సిల్ అజెండా పెట్టామని కమిషనర్ కృష్ణ, ఆర్ఒ నాసిర్ తెలిపారు. కనీసం మార్కెట్ వేలం అజెండాను కౌన్సిల్ ఆమోదం చేయకుండానే చైర్మన్ ఆమోదంతో గత ఆరు నెలలుగా కొనసాగిస్తున్నారని, దీనికి ఎవరు బాధ్యులని చైర్మన్ శాంతను ప్రశ్నించారు. ఎన్నో తప్పులు చేసి కౌన్సిలర్లపై కక్ష సాధింపు తగదని హితవు పలికారు. కేవలం మానవతా దృక్పథంతోనే వ్యవహరించాలని, ఇలా కక్ష సాధింపు చర్యలను విడనాలని కోరారు. కమిటీలు వేయకుండానే కుక్కలను పట్టుకునేందుకు ఎలా తీర్మానం పెడతారని, ముందుగా కమిటీ వేయాలని ఎమ్మెల్యే సైతం చెప్పారని కౌన్సిలర్ సందీప్ రెడ్డి పేర్కొన్నారు. చివరకు కుక్కలను పట్టుకునేందుకు పర్యవేక్షించే కమిటీని వేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. కౌన్సిల్ సమావేశంలో 84 అంశాలు ఉన్నా అనేక అంశాలు వాయిదా వేస్తూ సమావేశాన్ని మూడు గంటల వరకు నిర్వహించారు.

అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్లు



మాట్లాడుతున్న కమిషనర్ కృష్ణ

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

- ప్రత్యేకాధికారి విజయ్ కుమార్, తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్

ప్రజాశక్తి - చిప్పగిరి

ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న పొలం సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి విజయ్ కుమార్, తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ తెలిపారు. శనివారం మండలంలోని నగరడోనా గ్రామంలో రెవెన్యూ కార్యదర్శి రంగన్న ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సమస్యలున్న రైతులందరూ వివరాలతో కూడిన దరఖాస్తులను అధికారులకు అందజేశారు. టిడిపి నాయకులు పులికొండ, అంజి, రంగన్న, మండల సర్వేయర్ నారాయణ, విలేజ్ సర్వేయర్ గోవర్ధన, విఆర్ఒలు మల్లికార్జున పాల్గొన్నారు. **ఆస్పరి** మండలంలోని చిగిలి గ్రామంలోని సచివాలయంలో విఆర్ఒ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహశీల్దార్ శివ శంకర్ నాయక్, దేవదాయ శాఖ జిల్లా అధికారి శ్రీనివాసులు, ఇన్‌ఛార్జీ ఆర్ఐ రంగస్వామి, మండల సర్వేయర్ శ్రీనివాసులు, సర్పంచి జయమ్మ, ఎంపిటిసి రాధాకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

నగరడోనా (చిప్పగిరి)లో రెవెన్యూ సదస్సు



ఆస్పరిలో మాట్లాడుతున్న తహశీల్దార్ శివ శంకర్ నాయక్

శభాష్ పోలీస్..!

- అంతర్ జిల్లా దొంగలు అరెస్టు
- సిఐ శ్రీరామ్‌కు డీఎస్పీ అభినందన

ప్రజాశక్తి - ఆదోని

అంతర్ జిల్లా దొంగలను అరెస్టు చేసి వారి నుండి సొమ్ము రికవరీలో ప్రతిభ చూపి ఆదోనికే వన్నె తెచ్చారని డీఎస్పీ సోమన్న అభినందించారు. శనివారం అరెస్టు అయిన నిందితులను, రికవరీ చేసిన సొమ్మును విలేకరుల సమావేశంలో ప్రవేశపెట్టారు. సొమ్ము రికవరీలో ప్రతిభ చూపిన వన్ టౌన్ సిఐ శ్రీరామ్, పోలీసు సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా డీఎస్పీ సోమన్న మాట్లాడారు. ఆదోనిలో పలుచోట్ల జరిగిన చోరీ కేసులను ఛేదించాలని పోలీసులు కంకణం కట్టుకున్నారని తెలిపారు. జిల్లాలో పలు చోట్ల జరిగిన చోరీ కేసులను ఛేదించి సంయుక్తంగా వంద శాతం రికవరీ చేశామని చెప్పారు. ఆలూరు, డోన్‌కు చెందిన దొమ్మర గోవిందు రాజులు, ఎరుకలి బండి చిన్నిలు పలుచోట్ల దొంగతనాలకు పాల్పడ్డారని తెలిపారు. వారిపై ప్రత్యేకంగా నిఘా ఉంచి అరెస్టు చేసి వారి వద్ద నుంచి 80 గ్రాముల బంగారం, రూ.1.76 లక్షల నగదు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించామని చెప్పారు. మరో ఇద్దరు దొంగలు పరారీలో ఉన్నారని తెలిపారు. బంగారం, నగదును రికవరీ చేసిన వన్ టౌన్ సిఐ శ్రీరామ్, పోలీసులు తీసుకున్న చర్యలు పోలీసు వ్యవస్థకే వన్నెతెచ్చాయన్నారు.

అరెస్టును చూపుతున్న పోలీసులు

ప్రతివాదికి నోటీసులు
మహా రాజశ్రీ కర్నూలు జిల్లా ప్రధాన న్యాయ మూర్తి వారి కోర్టులో : కర్నూలు
O.S.No. 21/2024
ఈ. హరిశ్చంద్రా రెడ్డి ... వాది
-ఎదిరి-
యం. శశికాంత్ రెడ్డి ... ప్రతివాది
నోటీసు
ఇందుమూలముగా పైన తెలిపిన ప్రతివాదికి తెలియజేయడ మేమనగా, వాది పైన తెలిపిన ఘనమైన న్యాయస్థానములో మీపైన దావా దాఖలు చేసినారు. సదరు దావా లో మీకు కోర్టు ద్వార నోటిసులు పంపినను మీరు అట్టి నోటిసులు తీసుకోనందున ఘనమైన కోర్టు వారు ఈ పత్రికా ప్రకటన ద్వార మీకు నోటిసులు అందజేయుటకు ఉత్తర్వు జారి చేసినారు. కావున మీరు ఈ నోటిసు చూసిన వెంటనే క్రింద తెలిపిన తేది నాడు ఉదయం 10 గంటలకు నేరుగా గాని న్యాయవాది ద్వార గాని హజారై మీ అభ్యంతరాలను తెలుపుకోగలరు.
వాయిదా తేది : 10-01-2025
ప్రతివాది చిరునామా:-
యం శశికాంత్ రెడ్డి, S/o: యం. వెంకట రెడ్డి, R/o: ఫ్లాట్ నెం .401, నాలుగో అంతస్తు, శ్రీ బాలాజీ నివాస్ అపార్టుమెంటు, సాయి సదన్ అపార్టుమెంటు ఎదురుగా, కేశవ రెడ్డి స్కూలు దగ్గర, మారుతి నగర్ ,వి. ఆర్. కాలని, కర్నూలు సిటి, జిల్లా
వాది తరుపు న్యాయవాదులు:-
డి.భాస్కర రెడ్డి, డి.సత్య నారాయణ రెడ్డి, కర్నూలు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రామాంజనేయులు, రాధాకృష్ణ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో జరిగే సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బి.రామాంజనేయులు, పిఎస్.రాధాకృష్ణ, జిల్లా నాయకులు గురు శేఖర్, గోవిందు, హనుమంతు కోరారు. శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పట్టణంలో మొదటిసారి సిపిఎం జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నారని, జయప్రదం చేయాలని పట్టణ ప్రజలను కోరారు. నాయకులు లక్ష్మీ నరసయ్య, అబ్దుల్లా, రమేష్, సిఐటియు నాయకులు రాముడు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప, జిల్లా నాయకులు విజయ్ పాల్గొన్నారు.

గోనెగండ్ల : ఎమ్మిగనూరు పట్టణంలో ఆది, సోమవారాల్లో నిర్వహించే సిపిఎం 23వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని రైతుసంఘం నాయకులు అబ్దుల్లా, నరసింహులు, ప్రజానాట్యమండలి నాయకులు సుంకన్న, బత కన్న, బాలు, లక్ష్మన్న కోరారు. మండలంలోని అగ్రహారం, బైలుప్పల, గంజిహళ్లి, గోనెగండ్ల, చిన్నమరివీడు, పెద్దమరివీడు, అల్వాల, హెచ్.కైరవాడి గ్రామాల్లో ప్రజానాట్యమండలి కళాకారులతో జీపు జాతా ద్వారా ప్రచారం నిర్వహించారు. గోనెగండ్ల వైఎస్ఆర్ సర్కిల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... జిల్లా సమగ్రాభివృద్ధికి ముఖ్యంగా పశ్చిమ ప్రాంతంలో తాగు, సాగునీటి వనరుల ఏర్పాటు, విద్య, ఉపాధి రంగాలపై ప్రభుత్వాలు చేపట్టాల్సిన చర్యలపై మహాసభల్లో చర్చించడంతోపాటు రానున్న రోజుల్లో ప్రభుత్వాలు ఆ దిశగా చర్యలు తీసుకునేలా పోరాట కార్యక్రమాలను రూపొందిస్తారని తెలిపారు.

బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న సిపిఎం నాయకులు హనుమంతు

గోనెగండ్లలో ప్రచారం నిర్వహిస్తున్న కళా బృందం

సచివాలయ సిబ్బంది, వాలంటీర్లపై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఐకి ఎంఆర్‌పిఎస్, మాలమహానాడు వినతి

ప్రజాశక్తి - హోళగుంద

గ్రామ వాలంటీర్లపై చర్యలు తీసుకోవాలని ఎంఆర్‌పిఎస్, మాల మహానాడు నాయకులు కోరారు. శనివారం ఎస్ఐ బాలనరసింహులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలోని హెబ్బటం, నెరణికి, మార్లమడికి చుట్టుపక్కల గ్రామాల్లో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు గత వైసిపి పాలనలో కుల గణన సర్వే చేపట్టారని తెలిపారు. ఈనెలలో గ్రామ/వార్డు సచివాలయ బోర్డులో ప్రదర్శించిన జాబితాలో కురువలను ఎస్సీలుగా చూపారని, ఆ పేర్లను జాబితా నుంచి తొలగించి.. ఇలాంటి చర్యలకు పాల్పడిన గ్రామ/వార్డు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు కోగిలతోట వీరేష్, కోఆర్డినేటర్ గోవర్ధన్, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు మహానంది, సాయిరాం, నాయకులు హెబ్బటం వన్నూరప్ప, వెంకటరాముడు పాల్గొన్నారు. అలాగే ప్రజాసంఘాల నాయకులు సచివాలయ సిబ్బందికి వినతిపత్ర అందజేశారు. మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల వన్నూరప్ప, ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు ఫక్కీరప్ప, నాయకులు భీమేష్ మాదిగ, ముసలయ్య, కాదరప్ప, దేవారింటి చిన్న ఉలిగప్ప, హరిజన హనుమంతు, పరశురాముడు, గోసంగి పెద్ద ఈరన్న, లింగంపల్లి శేషగిరి పాల్గొన్నారు. అలాగే గజ్జహల్లి గ్రామ సచివాలయంలో వినతిపత్రం అందజేశారు. ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు కేంచప్ప, గ్రామ కమిటీ సభ్యులు రామలింగ, ముకమ్మ, పతి, నాగ, దానప్ప, తాయప్ప పాల్గొన్నారు.

'పేరుకే ఆర్ఎంపి'పై విచారణ

- డిఎంహెచ్ఒ శాంతికళ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

ప్రజాశక్తి దినపత్రికలో ఈనెల 26న 'పేరుకే ఆర్ఎంపి' పేరుతో ప్రచురితమైన కథనంపై విచారణ చేపట్టినట్లు డిఎంహెచ్ఒ డాక్టర్ శాంతి కళ తెలిపారు. శనివారం వివరణను విడుదల చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి హెబ్బటం గ్రామానికి వెళ్లి ఆర్ఎంపి శివకుమార్ క్లినిక్‌ను సందర్శించి విచారణ చేపట్టారని తెలిపారు. సరయిన అర్హత పత్రాలు లేకుండా ప్రాక్టీస్ చేస్తున్నట్లు గుర్తించారని, ఇకపై ప్రాక్టీస్ చేయనని ఆ ఆర్ఎంపి నుంచి రాతపూర్వకంగా రాయించుకున్నారని పేర్కొన్నారు.

'తుంగభద్ర'పై కుడికాలువ కోసం కృషి చేయాలి

- రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య

ప్రజాశక్తి - కౌతాళం

తుంగభద్ర నదిపై కుడి కాలువ మంజూరు చేయించి నిర్మాణానికి కృషి చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య కోరారు. కర్నూలు జిల్లా తుంగభద్ర ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన టిప్పు సుల్తాన్‌ను మల్లయ్య, రైతు సంఘం మండల కార్యదర్శి బి.ఈరన్న, నాయకులు వెంకటేశులు కలిసి శనివారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులకు ఎల్ఎల్‌సి ద్వారా సాగునీరు అందించేందుకు కృషి చేస్తూ, తుంగభద్ర నదిపై చీకల పర్వి దగ్గర బ్రిడ్జి కం బ్యారేజ్ ఏర్పడుతుందని తెలిపారు. అందుకు కుడికాలువ కోసం కృషి చేయాలని, జిల్లాలోని పశ్చిమ ప్రాంతమంతా అభివృద్ధి చెందుతుందని చెప్పారు.

మాట్లాడుతున్న నాయకులు

జగన్ అవినీతి వల్లే విద్యుత్ భారాలు

- మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

జగన్ అవినీతి వల్లే ప్రజలపై విద్యుత్ భారాలు పడుతున్నాయని ఆదోని మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. రూ.1,29,000 కోట్లు విద్యుత్ చార్జీలు జగనే పెంచి ధర్నాలు చేయడం ప్రజలను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. 22.5 మిలియన్ యూనిట్ల లోటుతో 2014లో చంద్రబాబు పాలన మొదలై 2019లో మిగులు విద్యుత్‌ను జగన్ రెడ్డి చేతిలో పెట్టారని తెలిపారు. చేతకాని పాలన, కక్ష సాధింపు విధానాలే ఈ దుస్థితికి కారణమని మండిపడ్డారు. జగన్ రెడ్డి పాలనలో ఐదేళ్లలో 10సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై రూ.32 వేల కోట్ల భారం మోపారని విమర్శించారు. నేడు రాష్ట్రంలో 20 వేల మెగా వాట్ల విద్యుత్ సామర్థ్యం గల విద్యుత్ ప్లాంట్లను చంద్రబాబు పాలనలో నిర్మించినవే అని, దీని వల్లే రైతులకు ఉచిత విద్యుత్, ఎస్సీ, ఎస్టీ, బీసీలు, కుల వృత్తిదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆక్వా రైతులకు 1.50 యూనిట్ విద్యుత్ ఇవ్వగలుగుతున్నామని తెలిపారు.

గోడౌన్ హమాలీల సమస్యల పరిష్కారానికి కృషి

- టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

సెంట్రల్ వేర్‌హౌస్ బియ్యం గోదాం హమాలీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. శనివారం గోదాం సమీపంలో యూనియన్ నూతన కమిటీ ఎన్నుకున్నారు. సెంట్రల్ వేర్‌హౌస్ గోడౌన్ హమాలీ సంఘం గౌరవాధ్యక్షులుగా గుడిసె ఆది కృష్ణమ్మ, అధ్యక్షులుగా కృష్ణ, కార్యదర్శిగా అంజి, ఉపాధ్యక్షులుగా కిష్టప్ప, సహాయ కార్యదర్శిగా మారెప్ప, కోశాధికారిగా దానప్ప, సలహాదారులుగా ఎస్.ఉరుకుంద, రమేష్‌ను ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్ష, కార్యదర్శులను కృష్ణమ్మ సన్మానించారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

ప్రజాశక్తి - పెద్దకడబూరు

పెద్దకడబూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్ అభివృద్ధి పనులకు శనివారం భూమి పూజ చేశారు. తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ నరవ రమాకాంత రెడ్డి భూమి పూజ నిర్వహించారు. పాఠశాలలో సమగ్ర శిక్షణ పథకం కింద రూ.58 లక్షలతో లైబ్రరీ, సైన్సు ల్యాబ్, కంప్యూటర్ గదుల నిర్మాణం, ఆటస్థలం అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ స్వామి రాజు, టిడిపి నాయకులు మల్లికార్జున, మీసేవా ఆంజనేయులు, నరసన్న, ఆశన్న, ఇమ్మానుయేల్, ఆదాం, దేవసహాయం, క్రాంతికుమార్, సందీప్, సుధాకర్ పాల్గొన్నారు.

భూమిపూజ చేస్తున్న నాయకులు

ఈకేవైసీ తప్పనిసరి

- పర్సన్ ఇన్‌ఛార్జీ శ్రీనివాసులు

ప్రజాశక్తి - నందవరం

నందవరం ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం ఖాతాదారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలని పర్సన్ ఇన్‌ఛార్జీ ఎం.శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఆయన సొసైటీ కార్యాలయంలో మాట్లాడారు. ఖాతాదారులు ప్రతి ఒక్కరూ సచివాలయాల్లో ఈకేవైసీ చేసుకోవాలన్నారు. ఈకేవైసీ చేయించుకోపోతే ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలకు అనార్హులవుతారని తెలిపారు. ఓటు హక్కును కూడా కోల్పోతారని చెప్పారు. సిఇఒ బాణాల సుదర్శనం, కెవి.గోపాల్ రావు, ప్రతాప్, వి.మల్లి, భారత్ చంద్ర, జి.వీరారెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు

- ఇఒఆర్‌డి బాలన్న

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రభుత్వ ఆధీనంలో ఉన్న స్థలాలను ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇఒఆర్‌డి బాలన్న హెచ్చరించారు. శనివారం ఆయన మండల కార్యాలయంలో మాట్లాడారు. ప్రభుత్వం ఆదేశాల ప్రకారం 188 జిఒలో పొందుపరిచిన అంశాల మేరకు గ్రామ కంఠంలో ఉన్న ప్రభుత్వ స్థలాలను ఎవరైనా కబ్జా చేస్తే వారిపై కోర్టు ద్వారా నోటీసులు ఇచ్చి చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉందన్నారు. ఆయా పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వం గ్రామ కంఠంలో ఉన్న స్థలాలను గురించి పూర్తి వివరాలు అడిగినప్పుడు ఇవ్వడానికి సిద్ధంగా ఉండాలన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆర్‌టిసి బస్సు

- ఒకరికి గాయాలు

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని కైరుప్పల గ్రామ సమీపంలో ఆర్‌టిసి బస్సు బైక్‌ను ఢీకొట్టిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. సిఐ మస్తాన్ వలీ వివరాల మేరకు... బైలుప్పల గ్రామానికి చెందిన పెద్దయ్య కుటుంబ సభ్యులతో కలిసి పెరవలి రంగస్వామిని దర్శించుకోవడానికి ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. కైరుప్పల గ్రామ సమీపంలో పత్తికొండ డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు ఎమ్మిగనూరుకు వెళ్తుండగా స్టీరింగ్ విరిగిపోయి, అదుపు తప్పి బైక్‌ను ఢీకొట్టడంతో బైక్‌పై వెళు న్న పెద్దయ్యకు కాలు విరిగింది. ఐదేళ్ల కుమారుడు విష్ణుకు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సిఐ తెలిపారు.

భూ తగాదాలో బాధితుడిని చితకబాదిన ఎస్ఐ

- కురువ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ దేవేంద్రప్ప

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

ఎస్ఐకి సంబంధం లేని అన్నదమ్ముల పంచాయితీలో రైతు అని కూడా చూడకుండా కురువ ఉరుకుందును కొట్టడం దారుణమని కురువ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ దేవేంద్రప్ప విమర్శించారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న పెద్దకడుబూరు మండలం హెచ్.మురవణి గ్రామానికి చెందిన కురువ ఉరుకుందును పరామర్శించారు. అనంతరం బాధితుడు ఉరుకుందును వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దేవేంద్రప్ప మాట్లాడారు. కురువ ఉరుకుంద పొలానికి వెళ్లే రస్తా విషయమై అన్నదమ్ముల మధ్య సుమారు 25 రోజుల క్రితం చిన్న వాదోపవాదాలు జరిగాయని తెలిపారు. వాటిని ఆసరాగా చేసుకుని పెద్దకడబూరు ఎస్ఐ ఉరుకుంద కుమారులను స్టేషన్‌కు రావాలని చెప్పి బెదిరిస్తున్నారని చెప్పారు. కొట్టినట్లు బాధితుడు ఉరుకుంద తెలిపారని అన్నారు. 'నన్నెందుకు కొడతావు' అన్నందుకు.. 'పొద్దున రూ.10 లక్షలు తీసుకుని, నీ కుమారులను కూడా తీసుకు రాకపోతే మరిన్ని కేసులు పెడతాన'ని బెదిరిస్తున్నాడని బాధితుడు తెలిపారని అన్నారు. ఈ విషయం గురించి బయట ఎవరికైనా చెబితే మరిన్ని కేసులు పెడతానని వేధిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఐపై చర్యలు తీసుకునే విధంగా ఎస్పీని కలుస్తామని చెప్పారు. కురువ సంఘం నాయకులు పెద్దకడబూరు కురువ మల్లికార్జున, మసీదుపురం కురువ శివలింగ, మురవణి రామలింగడు, బీరప్ప పాల్గొన్నారు.

కురువ ఉరుకుందును పరామర్శిస్తున్న చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప

In the court of the hon'ble principal District Judge : Kurnool.
A.S.No.8/2023
C.Ramakrishna. ...Appellant
-Vs-
S.Sakir Basha and Other. ...Respondents
Notice to Respondent No.2
R2) Sri D.Parameswara Reddy
S/o D.Ramakrishna Reddy,
aged 43 years. Real Estate agent.
Resident of D.No.3-108, Balajinagar,
Kurnool.
పై నెంబర్ అప్పీలును అప్పిలెంట్ ఈ క్రింది షెడ్యూలు ఆస్తి విషయమై దాఖలు చేసి యుంటున్నాడు. యిందు విషయమై నీకు ఏమైనా ఆక్షేపణలున్న యెడల స్వయముగా గాని, వకీలు గారి ద్వారా గాని, పై కోర్టు నందు హాజరై తేది.03-01-2025న ఉదయం 10.30 గంటలకు తెలుపుకొనవలెను. లేనంతట నీ పరోక్షమున విచారించి తీర్మానించబడును. అని తెలియజేయడమైనది.
SCHDULE
Vacant house plot bearing No.61, Located in Sanath Nagar, Laid in sy No.659/1 of kallur limits asper the L.P.No.459/82, Presently in Kurnool, Municipal Coroporation Limts, Kallur S.D, Kurnool R.D
Measering :
East - West - 60 Feet
North - South - 40 Feet
Bounded on :
East - by 33 Feet Road.
West - By Plot No.56
North - By Plot No.60 and
South - By Plot No.62
(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)
యం.డి.వి. జోగయ్యశర్మ,
అప్పీలెంట్ పరము వకీలు,
కర్నూలు.

In the court of the hon'ble principal District Judge : Kurnool.
I.A.No.451/2023 in A.S.No.8/2023
C.Ramakrishna. ...Petitioner/Defendant
-Vs-
Sri S.Sakir Basha and Other. ...Respondents (Respondents)
Notice to Respondent No.2
R2) Sri D.Parameswara Reddy
S/o D.Ramakrishna Reddy, Hindeu,
aged 43 years. Real Estate Business,
Resident of D.No.3-108, Balajinagar,
Kurnool.
పై నెంబర్ అర్జీని అర్జీదారు ఈ క్రింది షెడ్యూలు విషయమై Interim injunction order కు గాను అర్జీదాఖలు చేసి యుంటున్నాడు. యిందు విషయమై నీకు ఏమైన ఆక్షేపణలున్న యెడల స్వయముగా గాని, వకీలు గారి ద్వారా గాని పై కోర్టు నందు హాజరై తేది.03-01-2025న ఉదయం 10.30 గంటలకు తెలుపుకొన వలెను, లేనంతట నీ పరోక్షమున విచారించి తీర్మానించబడును. అని తెలియజేయడమైనది.
SCHDULE
Vacant house plot bearing No.61, Located in Sanath Nagar, Laid in sy No.659/1 of kallur limits asper the L.P.No.459/82, Presently in Kurnool, Municipal Coroporation Limts, Kallur S.D, Kurnool R.D
Measering :
East - West - 60 Feet
North - South - 40 Feet
Bounded on :
East - by 33 Feet Road.
West - By Plot No.56
North - By Plot No.60 and
South - By Plot No.62
(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)
యం.డి.వి. జోగయ్యశర్మ,
అప్పీలెంట్ పరము వకీలు, కర్నూలు.

విభిన్న ప్రతిభావంతుల సమస్యలను పరిష్కరిస్తాం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విభిన్న ప్రతిభావంతుల సమస్యలను పరిష్కరిస్తామని ఎంపిడిఒ శ్రీనివాసులు అన్నారు. శనివారం ఓర్వకల్లు ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఎంపిడిఒ శ్రీనివాసులతోపాటు డిఎస్‌పి మహబూబ్‌బాషా ఎంపిపి తిప్పన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో వివిధ ప్రతిభావంతుల పట్ల చిన్నచూపు చూడకుండా వారికి అండగా నిలవాలని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌జెడి ఆకస్మిక పరిశీలన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పాఠశాల విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ కె.సామ్యూల్‌పాల్ శనివారం ఓర్వకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆకస్మిక పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం డిజిటల్ తరగతులను కూడా ఆయన పరిశీలన చేశారు. పదో తరగతి పరీక్షల నిర్వహణపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామచంద్రారెడ్డిని అడిగి తెలుసుకున్నారు.

ఇకెవైసికి రైతులు సహకరించాలి

ఉలిందకొండ సొసైటీ సిఇఒ హరిష్‌బాష

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : సచివాలయ సిబ్బంది ద్వారా చేపట్టిన ఇకెవైసికి రైతులు సహకరించాలని ఉలిందకొండ వ్యవసాయ పరపతి సహకార సంఘం సిఇఒ హరీష్ బాష రైతులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.ఇకెవైసి చేయించుకోవడం వల్ల ప్రభుత్వాలు అందించే రాయితీలు రైతులు పొందవచ్చన్నారు. సహకార సంఘాల అభివృద్ధికి కేంద్రం తోడ్పాటును అందిస్తుందని తెలిపారు. సహకార వ్యవస్థ బలోపేతానికి కొత్త సహకార సంఘాల ఏర్పాటు చేయనుందని చెప్పారు. ప్రభుత్వ రాయితీలు పొందేందుకు రైతులంతా ఇకెవైసి చేయించుకోవాలని కోరారు.

జిల్లా వెల్ఫేర్ అసిస్టెంట్ యూనియన్ ప్రెసిడెంట్‌గా పులి శేఖర్

ప్రజాశక్తి-తుగ్గలి

కర్నూలు జిల్లా వెల్ఫేర్ అసిస్టెంట్స్ యూనియన్ ప్రెసిడెంట్‌గా తుగ్గలి ఎడమ పులిశేఖర్, జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా హనుమేష్ (ఆదోని మండలం),జిల్లా ట్రెసరర్‌గా ఎం.వెంకటేష్ (కల్లూరు మండలం)జిల్లా జనరల్ సెక్రటరీ గా నీలాకంటేటేశ్వర సింగ్ (ఆస్పరి మండలం), జిల్లా మహిళా కార్యదర్శి1 గా సంధ్య, జిల్లా మహిళా కార్యదర్శి 2 గా ఉమాదేవి ఎన్నికయ్యారు. వెల్ఫేర్ అసిస్టెంట్స్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని తెలిపారు. సచివాలయంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్‌కు ఇంతవరకు ప్రమోషన్ ఛానల్, సరైన జాబ్ చార్ట్ లేదన్నారు. సంక్షేమాన్ని అమలు చేస్తున్న సంక్షేమ కార్యదర్శికె సంక్షేమం లేదన్నారు. రాష్ట్రయూనియన్ కోఆర్డినేట్ చేసుకుంటూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని చెప్పారు. వెల్ఫేర్ యూనియన్ రాష్ట్ర నాయకులు, జిల్లా యూనియన్ గౌరవ సలహాదారులు టి.పరమేష్ , వరప్రసాద్ పాల్గొన్నారు.

శిథిలావస్థ కల్వర్టుల నిర్మాణానికి చర్యలు

రహదారులపై మురుగునీరు రావద్దు-పూడికతీత పనులు ఆలస్యం చేయొద్దు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగరంలో శిథిలావస్థకు చేరిన కల్వర్టుల పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన బుధవారపేటలోని పలుకాలనీల్లో పర్యటించారు. స్థానికులతో కలియతిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చేపల గుంత మైదానంలో చేపట్టిన గ్రావెల్, నడకబాట వంటి అభివృద్ధి పనులను కమిషనర్ పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి, ప్రజల ఉపయోగార్థంలోకి తీసుకోరావాలని ఆదేశించారు. కాలువల్లో నీరు ప్రవాహానికి తక్కువ సామర్థ్యం ఉన్న కల్వర్టుల పునర్నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని కమిషనర్ ఆదేశించారు. కొళాయి కనెక్షన్ల కోసం రహదారులపై తీసిన గుంతలపై ప్యాక్‌వర్క్ పనులు చేపట్టాలని సూచించారు. పలు కాలనీల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. క్రమం తప్పకుండా ప్రతీ మురుగు కాలువలో పూడికతీత పనులు చేపట్టాలని, ఎట్టిపరిస్థితుల్లోనూ మురుగునీరు రహదారులపైకి రాకూడదని కమిషనర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించి, ఆహారరుచి, పరిసరాల శుభ్రతపై ఆరా తీశారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర్ రెడ్డి, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ అంజాద్ బాష, ట్రైనీ ఎఇ రాంమోహన్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల పెండింగు బకాయిలు విడుదల చేయాలి

ప్రజాశక్తి-మద్దికేర

ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మద్దికేరతహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ చదువుతున్న విద్యార్థులకు పెండింగులో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ వసతి దీవెన డబ్బులు విడుదల చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు శ్రీకాంత్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీ జీవో నెంబర్ 77 రద్దు చేయాలన్నారు. శనివారం మద్దికేర తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఎఐఎస్ఎఫ్ కర్నూలు జిల్లా ఉపాధ్యక్షుడు పులింద్ర శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ ఇంజనీరింగ్ పీజీ చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.2100 కోట్లు వసతి దీవెన రూ. 1480కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రతి సంవత్సరం విద్యార్థులకు సంబంధించి నాలుగు క్వార్టర్ల రూపంలో డబ్బులు జమ అయ్యేవని, గత సంవత్సరం విద్యార్థులకు కేవలం ఒక క్వార్టర్ మాత్రమే విడుదల అయ్యాయన్నారు. మిగతా మూడు క్వార్టర్లు విడుదల కాలేదని తెలిపారు. రాష్ట్రంలో దాదాపు 9.5 లక్షల మంది విద్యార్థులు డిగ్రీ ఇంజనీరింగ్ పీజీ వి ద ్య న ం అభ్యసిస్తున్నారన్నారు. దానిలో ఒక క్వాటర్ ఫీజులు రూ.708 కోట్లు విడుదల చేశారని, మూడు క్వాటర్లకు సంబంధించి దాదాపు రూ.2100 కోట్లు విడుదల చేయలేదన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు జీవో నెంబర్ 77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఎఐఎస్ఎఫ్ మండల ఉపాధ్యక్షులు తిప్పన్న, పవన్, జస్వంత్, వేణు, అనిల్, జగన్ రంగా, పాల్గొన్నారు.

జగన్ అవినీతి వల్లే విద్యుత్ ఛార్జీల పెంపు

-ఛార్జీలు పెంచింది మీరే ధర్నాలు చేసేది మీరేనా -ఎమ్మెల్యే కెఇ.శ్యాం బాబు

ప్రజాశక్తి-పత్తికొండ

ఐదేళ్ల పాలనలో పదిసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై రూ.32 వేల కోట్ల విద్యుత్ భారం మోపిన ఘనత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దేనని ఎమ్మెల్యే కెఇ. శ్యాంబాబు విమర్శించారు. శనివారం ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో అందుబాటులో ఉన్న విద్యుత్తు ప్లాంట్లలో పూర్తిస్థాయిలో విద్యుత్తు ఉత్పత్తి చేయకపోవడం, విద్యుత్ సరఫరా చేసే ప్రాజెక్టులు పూర్తి చేయకపోవడం వంటి ఎన్నో కారణాలతో విద్యుత్ కొరత ఏర్పడగా అధిక ధరలకు వేరే రాష్ట్రాల నుంచి విద్యుత్ కొనుగోలు చేసి జగన్ ప్రజలపై రూ.32 వేల కోట్ల అదురుబరాన్ని మోపాడని అన్నారు. అంతేకాకుండా విద్యుత్ సంస్థలపై అప్పులు, అప్పులకు వడ్డీలు ఇతరత్రా కారణాలకు సంబంధించి మొత్తం పై రూ.1,29,503 కోట్లు విద్యుత్ పైనే జగన్ ఖర్చు చేసాడని అన్నారు. ఉమ్మడి రాష్ట్రాలు విడిపోయాక 22.5 మిలియన్ యూనిట్ల విద్యుత్ కొరతతో 2014లో చంద్రబాబు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారన్నారు. 2019 వరకు ఐదేళ్ల పాలనలో విద్యుత్ లోటును అధిగమించి 2019లో వైసిపి ప్రభుత్వానికి మిగులు విద్యుత్ అందించడం జరిగిందన్నారు. తప్పుడు నిర్ణయాలతో పదిసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారాన్ని మోపిన జగన్మోహన్ రెడ్డి నేడు టిడిపి వళ్ల విద్యుత్ చార్జీలు పెరిగాయంటూ ధర్నాలకు పిలుపునివ్వడం హాస్యాస్పదమన్నారు.

నాయి బ్రాహ్మణుల అభివృద్ధికి సహకరించండి

హలో దేవాదాయ శాఖ మంత్రికి నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ విజయకుమార్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

రాష్ట్రంలో నాయి బ్రాహ్మణుల సంక్షేమానికి, అభివృద్ధికి సహకరించాలని నాయి బ్రాహ్మణ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పాలకవీటి విజయకుమార్ అన్నారు. శనివారం మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో దేవాదాయధర్మాదాయ శాఖ మంత్రివర్యులు ఆనం రామనారాయణ రెడ్డిని కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. దేవాలయాల్లో పనిచేస్తున్న నాయి బ్రాహ్మణలను, కళ్యాణ కట్టలో పనిచేస్తున్న క్షురకులను పర్మినెంట్ చేయాలని అన్నారు. జిల్లాకో సంగీత రెసిడెన్సియల్‌కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు. కుటుంబానికి దేవాలయ భూములలో రెండు సెంట్లు స్థలంలో ఇల్లు వసతి కల్పించాలని, కళ్యాణకట్టలలో తలనీలాల వేలంపాటలలో నాయీ బ్రాహ్మణులకు అవకాశం కల్పించాలని కోరారు. మంత్రి మాట్లాడుతూ సమస్యలన్నీ పరిష్కరిస్తారని , అదేవిధంగా నాయిబ్రాహ్మలకు సంబంధించిన సమస్యలపై సీఎంతో కూడా చర్చిస్తానని చెప్పారన్నారు. ఆంధ్రప్రదేశ్ నాయి బ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు ఎం.ఆదినారాయణ ,కడియాల కొండన్న పాల్గొన్నారు.

కొబ్బరిసాగుకు ఉద్యాన శాఖ ప్రోత్సాహం

సాగుపై రైతులకు శిక్షణ

ప్రజరాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

కొబ్బరిసాగుకు ఉద్యాన శాఖ ప్రోత్సాహం అందిస్తామని కర్నూలు జిల్లా ఉద్యాన శాఖ అధికారులు తెలిపారు. కర్నూలు ఉద్యాన శాఖ భవన్‌లో శనివారం మధ్యాహ్నం రెండు గంటల వరకు కొబ్బరి సాగుపై సాంకేతిక శిక్షణ కార్యక్రమం నిర్వహించామన్నారు. కొబ్బరి రైతులకు కోకోనట్ బోర్డు ఉద్యాన శాఖ ద్వారా శిక్షణ ఇస్తుందని ఉద్యానవన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామాంజనేయులు తెలిపారు. ఇందులో భాగంగా డాక్టర్ వైఎస్ఆర్ యూనివర్సిటీ ప్రిన్సిపల్ సైంటిస్ట్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ .ఎం తిరుపతి రెడ్డి, జిల్లా వాతావరణం కొబ్బరి సాగుకు అనుకూలమని రైతులు కొబ్బరి , ఇతర పంటల ద్వారా అధిక ఆదాయం పొందవచ్చునని తెలిపారు. రైతులకు కొబ్బరిలో వచ్చు చీడపీడలకు యాజమాన్య పద్ధతులు వివరించారు. కోకోనట్ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ కుమార్ వేలు కోకోనట్ విలువ ఆధారిత ఉత్పత్తులు , కోకోనట్ బోర్డు ద్వారా రైతులకు లభించు వివిధ రాయితీలు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎంఐ పిడి

ఉమాదేవి మాట్లాడుతూ కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డ్ వారు అందించు పథకాలను రైతుల సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లా ఉద్యాన అధికారి రామాంజనేయులు మాట్లాడుతూ కొబ్బరి పంట ప్రాముఖ్యత అలాగే కొబ్బరి పంట సాగు పై వచ్చే ఆదాయం పైన రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలోఎపిడి రాధాకృష్ణారెడ్డి , డాక్టర్ వైఎస్ఆర్ హెచ్‌యు, ప్రిన్సిపల్ సైంటిస్ట్ తిరుపతి రెడ్డి ,ఉద్యాన శాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.